28-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - అనంతమైన సేవ కొరకు మీ బుద్ధి నడవాలి, ఎటువంటి పెద్ద గడియారాన్ని తయారుచేయండి అంటే దాని ముల్లులో రేడియం ఉండాలి, అది దూరం నుండే మెరుస్తూ కనిపించాలి"

ప్రశ్న:- సేవను వృద్ధి చేయడానికి ఏ యుక్తిని రచించాలి?

జవాబు:- మహారథులైన, చురుకైన పిల్లలు ఎవరైతే ఉన్నారో, వారిని తమ వద్దకు పిలుచుకోవాలి. మహారథి పిల్లలు తిరుగుతూ ఉన్నట్లయితే సేవ వృద్ధి చెందుతూ ఉంటుంది. అలా చేస్తే మా గౌరవం తగ్గిపోతుంది అని భావించకూడదు. పిల్లలు ఎప్పుడూ దేహాభిమానంలోకి రాకూడదు. మహారథుల పట్ల చాలా-చాలా గౌరవాన్ని ఉంచాలి.

పాట:- ఈ సమయం వెళ్ళిపోతోంది... (యహ్ వక్త్ జా రహా హై...)

ఓం శాంతి. గడియారం పేరు వినేటప్పటికి అనంతమైన గడియారం గుర్తుకొచ్చింది. ఇది అనంతమైన గడియారం, ఇదంతా బుద్ధి ద్వారా అర్థం చేసుకోవాల్సిన విషయం. అందులో కూడా పెద్ద ముల్లు మరియు చిన్న ముల్లు ఉన్నాయి. సెకండ్ల ముల్లు అయిన పెద్ద ముల్లు తిరుగుతూ ఉంటుంది. ఇప్పుడు రాత్రి 12 గంటలవుతోంది అనగా రాత్రి పూర్తయి మళ్ళీ పగలు ప్రారంభమవ్వనున్నది. ఈ అనంతమైన గడియారం ఎంత పెద్దగా ఉండాలి. ఇందులో ముళ్ళు ఏవైతే తయారుచేస్తారో వాటిలో దూరం నుండే మెరుస్తూ కనిపించేలా రేడియంను కూడా వాడాలి. గడియారం అయితే దానంతట అదే అర్థం చేయిస్తుంది. ఎవరైనా కొత్తవారొస్తే వారు వచ్చి గడియారాన్ని చూడాలి. తప్పకుండా ముల్లు చివరిలోకి వచ్చి చేరుకుందని బుద్ధి కూడా చెప్తుంది. వినాశనం తప్పకుండా జరగాలని ఎవరైనా అర్థం చేసుకోగలరు. ఆ తర్వాత మళ్ళీ సత్యయుగ ఆది. సత్యయుగంలో చాలా కొద్దిమంది ఆత్మలే ఉంటారు. కావున ఇంతమంది ఆత్మలందరూ తప్పకుండా తిరిగి వెళ్తారు. చిత్రాల ద్వారా అర్థం చేసుకోవడం చాలా సహజం. ఇటువంటి గడియారాన్ని ఎవరైనా తయారుచేస్తే చాలామంది కొనుక్కొని కూడా తమ ఇళ్ళల్లో పెట్టుకుంటారు. దీనిపై అర్థం చేయించాలి. ఇది కలియుగ భ్రష్టాచారీ ప్రపంచము. అనేక ధర్మాలు కూడా ఉన్నాయి. వినాశనం కూడా ఎదురుగా నిలబడి ఉంది. ప్రకృతి వైపరీత్యాలు కూడా జరగనున్నాయి. ఇప్పుడు ఈ లక్ష్మీ-నారాయణులు మొదలైనవారికి కూడా సత్యయుగ రాజ్యాధికారం ఎలా లభించింది? తప్పకుండా తండ్రి ద్వారా లభించి ఉంటుంది. పతిత-పావనుడు తప్పకుండా పతిత ప్రపంచములోకే వస్తారు, సంగమములో వస్తారు. పావన ప్రపంచములోకి అయితే తండ్రి వచ్చేది లేదు. సృష్టి చక్రము చిత్రములో అర్థం చేయించేందుకు ఇది చాలా ఫస్ట్ క్లాస్ విషయము మరియు ఈ చిత్రముతో అర్థం చేయించడం ఎవరికైనా చాలా సహజం. ఎవరి వద్దనైతే ధనం బాగా ఉందో వారు ఆర్టిస్టుకు వెంటనే ఆర్డర్ ఇవ్వాలి మరియు వస్తువు వెంటనే తయారవ్వాలి. గవర్నమెంట్ పని అయితే వెంటనే జరిగిపోతుంది, ఇక్కడైతే కష్టం మీద ఎవరైనా పని చేస్తారు. ఎవరైనా మంచి కళాకారుడు చిత్రాన్ని తయారుచేస్తే, అది శోభిస్తుంది కూడా. ఈ రోజుల్లో కళకు ఎంతో గౌరవం ఉంది. నాట్య కళను ఎంతగా చూపిస్తారు. ఇంతకుముందు ఈ విధంగా నాట్యాలు జరిగేవి అని భావిస్తారు కానీ అటువంటిదేమీ లేదు. ఈ అనంతమైన గడియారాన్ని వెంటనే తయారుచేయించాలి, తద్వారా మనుష్యులు బాగా అర్థం చేసుకోగలగాలి. దీని రంగు కూడా బాగా ప్రకాశిస్తూ ఉండే విధంగా ఉండాలి. పతిత-పావనుడిగా మనుష్యులెవ్వరూ కాలేరు. మనుష్యులు పతితులుగా ఉన్నారు కదా, అందుకే గానం చేస్తారు. పావన ప్రపంచము స్వర్గము. శ్రీకృష్ణుడే శ్యామముగా ఉండేవారని, తర్వాత వారే సుందరముగా అవుతారని, అందుకే శ్యామసుందరుడు అన్న పేరు వచ్చిందని మనుష్యులు అర్థం చేసుకోరు. మనకు కూడా ఇంతకుముందు అర్థమయ్యేది కాదు. ఇప్పుడు బుద్ధిలో ఉంది - తప్పకుండా కామచితిపై కూర్చోవడంతో నల్లగా అయిపోతాము అనగా ఆత్మ పతితముగా అయిపోతుంది అని. ఇది కూడా స్పష్టంగా వ్రాయాలి. వారసత్వాన్ని పరమపిత పరమాత్మ ఇస్తారు మరియు శాపాన్ని రావణుడు ఇస్తాడు. మనుష్యుల బుద్ధి రఘుపతి రాఘవ రాజా రాముని వైపుకు వెళ్ళిపోతుంది, కానీ రాముడు పరమపిత పరమాత్మ. బుద్ధి ద్వారా ఆలోచించి ఈ చిత్రాలన్నింటినీ తయారుచేయాలి ఎందుకంటే ఈ రోజుల్లో అందరూ తమను తాము భగవంతునిగా చెప్పుకుంటూ ఉంటారు. తండ్రి ఒక్కరేనని మీకు తెలుసు. ఇకపోతే ఆత్మలైన మనమందరమూ వెళ్ళి పరంధామంలో పరమాత్మునితో పాటు ఉంటాము. ఆ సమయంలో తండ్రి కూడా బ్రహ్మాండానికి యజమాని, మనం కూడా బ్రహ్మాండానికి యజమానులుగా ఉంటాము. తర్వాత తండ్రి అంటారు, పిల్లలైన మిమ్మల్ని నేను విశ్వానికి యజమానులుగా చేస్తాను. ఎవరు ఎంత గొప్ప రాజు అయినా, నేను విశ్వానికి యజమానిని అని అనరు. తండ్రి అయితే విశ్వానికి

యజమానులుగా తయారుచేస్తున్నారు. మరి ఇటువంటి మాతా-పితలపై ఎంతగా బలిహారం అవ్వాలి. వారి శ్రీమతము ప్రసిద్ధమైనది. దానిపై నడుస్తూ-నడుస్తూ ఇక చివరిలో శ్రీమతాన్ని పూర్తిగా పాటిస్తారు. ఇప్పుడు ఒకవేళ శ్రీమతముపై పూర్తిగా నడిచినట్లయితే శ్రేష్ఠముగా అయిపోతారు, ఎంతగా కష్టపడాల్సి ఉంటుంది. ఎప్పటివరకైతే యజ్ఞం ఉంటుందో అప్పటివరకూ పురుషార్థం కొనసాగుతూ ఉంటుంది.

ఇది రుద్ర జ్ఞాన యజ్ఞము. వారు కూడా శాంతి కొరకు రుద్ర యజ్ఞాలు చేస్తూ ఉంటారు. వాటి ద్వారానైతే శాంతి ఏర్పడదు. తండ్రిదైతే ఒకే యజ్ఞము, అందులో మొత్తం సామాగ్రి అంతా స్వాహా అయిపోతుంది మరియు క్షణములో జీవన్ముక్తి లభిస్తూ ఉంటుంది. వారు ఎన్ని యజ్ఞాలను రచిస్తారు, కానీ లాభమేమీ ఉండదు. పిల్లలైన మీరు అహింసాయుతులు. పవిత్రత లేకుండా ఎవ్వరూ స్వర్గములోకి వెళ్ళలేరు. ఇది చివరి సమయము. పతిత ప్రపంచము, భ్రష్టాచారీ రావణ ప్రపంచము, 100 శాతం అపవిత్రత, అశాంతి, దుఃఖితులు, రోగగ్రస్తులు... ఇదంతా వ్రాయవలసి ఉంటుంది మరియు స్వర్గములో ఉండేది శ్రేష్ఠాచారులు, 100 శాతం పవిత్రత, సుఖము, శాంతి, నిరోగీ. అది రావణుడి శాపము, ఇది శివబాబా వారసత్వము - పూర్తిగా రాసి ఉండాలి. భారత్ ఫలానా సమయం నుండి ఫలానా సమయం వరకు శ్రేష్ఠాచారిగా ఉండేది, తర్వాత ఫలానా సమయం నుండి భ్రష్టాచారిగా అయ్యింది. చూడగానే అర్థమయ్యే విధంగా వివరణ వ్రాసి ఉండాలి. అర్థం చేయించడం ద్వారా కూడా బుద్ధిలో నషా ఎక్కుతుంది. ఈ వ్యాపారంలోనే ఉన్నట్లయితే ఇక అభ్యాసమైపోతుంది. ఆ సేవను 8 గంటలు చేస్తారు కావున ఈ సేవను కూడా 8 గంటలు చేయాలి. సెంటర్లలో ఎవరైతే కుమార్తెలు ఉన్నారో, వారిలో కూడా నంబరువారుగా ఉన్నారు. కొందరికైతే సేవా అభిరుచి ఎంతగానో ఉంది. ప్రతి చోటుకు పరిగెడుతూ ఉంటారు. కొందరైతే ఒకచోట విశ్రాంతిగా కూర్చుండిపోతారు, వారిని ఆల్రౌండర్ అని అనరు. మహారథుల గురించి ఏమీ అర్థం చేసుకోకపోతే సేవ కూడా డీలా పడిపోతుంది. చాలామందికి తమ అహంకారం ఎంతగానో ఉంటుంది. మా గౌరవం ఉండాలి, ఎవరైనా వస్తే మా గౌరవం తగ్గిపోతుంది అని భావిస్తారు. మహారథులు అనేవారు సహాయం చేస్తారు అని అర్థం చేసుకోరు, తమ అహంకారం ఉంటుంది, ఇటువంటి మూర్ఖులు కూడా ఉన్నారు. తండ్రి అంటారు, సత్యమైన హృదయంపైనే స్వామి రాజీ అవుతారు. బాబా వద్దకు సమాచారాలైతే వస్తూ ఉంటాయి కదా. బాబా ప్రతి ఒక్కరి నాడిని అర్థం చేసుకుంటారు. ఈ బాబా కూడా అనుభవజ్ఞులే.

ఈ చక్రము యొక్క వివరణ చాలా బాగుంది. మీ ఈ వివరణ ప్రసిద్ధమైనట్లయితే మీ సేవ చాలా బాగా, విహంగ మార్గపు సేవగా అవుతుంది. ఇప్పుడైతే చీమ మార్గపు సేవ జరుగుతోంది. తమ దేహాభిమానంలోనే ఉంటారు, అందుకే బుద్ధి నడవదు. ఇప్పుడు ఇది విహంగ మార్గపు సేవ. ఏమేమి తయారుచేయాలి అంటూ సేవాధారులైన పిల్లల బుద్ధి నడుస్తూ ఉంటుంది. చిత్రాలపై అర్థం చేయించడం చాలా సహజము. ఇప్పుడు ఇది కలియుగము, సత్యయుగ స్థాపన జరుగుతుంది. తండ్రియే అందరినీ తిరిగి తీసుకువెళ్తారు. అక్కడ ఉన్నది సుఖము, ఇక్కడ ఉన్నది దుఃఖము. అందరూ పతితులుగా ఉన్నారు. పతిత మనుష్యులు ఎవ్వరికీ ముక్తి-జీవన్ముక్తులను ఇవ్వలేరు. వారంతా భక్తి మార్గపు కార్య-వ్యవహారాలను నేర్పించేవారు. గురువులంతా భక్తి మార్గానికి చెందినవారు. జ్ఞాన మార్గపు గురువులెవ్వరూ లేరు. ఇక్కడైతే ఎంత శ్రమ చేయాల్సి ఉంటుంది. భారత్ ను స్వర్గముగా తయారుచేయడములో ఇంద్రజాలము యొక్క ఆట ఉంది కదా, అందుకే వారిని ఇంద్రజాలికుడు అని కూడా అంటారు. శ్రీకృష్ణుడిని ఎప్పుడూ ఇంద్రజాలికుడు అని అనరు. శ్రీకృష్ణుడిని కూడా శ్యామము నుండి సుందరముగా తయారుచేసేవారు ఆ తండ్రియే. అర్థం చేయించేందుకు ఎంతో నషా ఉండాలి. బయటకు వెళ్ళాలి. పేదవారే జ్ఞానాన్ని బాగా తీసుకుంటారు. షావుకారులపై నమ్మకం తక్కువ ఉంటుంది. 100 మంది పేదవారు వెలువడితే, 1-2 షావుకారులు, 5-7 సాధారణమైనవారు వెలువడుతారు. పని ఇలాగే నడుస్తూ ఉంటుంది. ధనము అవసరం అంతగా ఉండదు. ప్రభుత్వం ఎన్ని ఆయుధాలు తయారుచేసిందో చూడండి. ఇరువైపుల వారూ - వినాశనం జరుగుతుంది, మేము వినాశనమైపోతాము అని అర్థం చేసుకుంటారు. అప్పుడు వేటగాడిగా అయ్యేది ఎవరు? రెండు పిల్లులు పోట్లాడుకుంటే వెన్న మధ్యలో కోతికి లభించింది అని కథ ఉంది కదా. శ్రీకృష్ణుని నోటిలో వెన్న చూపిస్తారు. వాస్తవానికి ఇది స్వర్గము రూపీ వెన్న. ఈ విషయాలను కష్టం మీద ఏ ఒక్కరో అర్థం చేసుకోగలరు. ఇక్కడ 20-25 సంవత్సరాలు ఉండేవారు కూడా ఏమీ అర్థం చేసుకోరు. ప్రారంభములో భట్టీ తయారైంది, అందులో ఎంతమంది వచ్చారు, ఎంతమంది వెళ్ళిపోయారు. కొందరు స్థిరపడ్డారు. డ్రామాలో కల్పపూర్వం కూడా ఇదే విధంగా జరిగింది. ఇప్పుడు కూడా ఇదే విధంగా జరుగుతోంది. చిత్రాలు ఎంత పెద్దగా ఉంటే అంతగా ఎవరికైనా అర్థం చేయించడం సహజమవుతుంది. లక్ష్మీ-నారాయణుల చిత్రం కూడా తప్పకుండా ఉండాలి. భక్తి మార్గం ఎప్పటి నుండి ప్రారంభమవుతుంది అనేది వృక్షం ద్వారా అర్థమవుతుంది. బ్రహ్మా యొక్క రాత్రి రెండు యుగాలు, తర్వాత బ్రహ్మా యొక్క పగలు రెండు యుగాలు. మనుష్యులు అర్థం చేసుకోరు కావున బ్రహ్మా సూక్ష్మవతనములో ఉన్నారని అంటారు.

కానీ ప్రజాపిత అయితే తప్పకుండా ఇక్కడే ఉంటారు. ఇవి ఎంత గుహ్యమైన రహస్యాలు, ఇవి శాస్త్రాలలో ఉండవు. మనుష్యులు అన్నీ తలక్రిందుల చిత్రాలను చూసారు, తలక్రిందుల జ్ఞానాన్ని విన్నారు. బ్రహ్మకు కూడా ఎన్నో భుజాలను చూపించారు. ఈ శాస్త్రాలు మొదలైనవేవైతే ఉన్నాయో ఇవన్నీ భక్తి మార్గపు సామాగ్రి. ఇవి ఎప్పటి నుండి ప్రారంభమవుతాయి అనేది ప్రపంచానికి తెలియదు. మనుష్యులు భక్తి ఎంతగా చేస్తారు, భక్తి లేకుండా భగవంతుడు లభించరు అని భావిస్తారు. కానీ ఎప్పుడైతే పూర్తి దుర్గతి ఏర్పడుతుందో అప్పుడే సద్గతి కొరకు భగవంతుడు లభిస్తారు. ఈ లెక్క గురించి మీకే తెలుసు. అర్ధకల్పం నుండి భక్తి ప్రారంభమవుతుంది. తండ్రి అంటారు - ఈ వేదాలు, ఉపనిషత్తులు, యజ్ఞ-తపాదులు మొదలైనవన్నీ భక్తి మార్గానికి చెందినవి. ఇవన్నీ సమాప్తమవ్వనున్నాయి. అందరూ నల్లగా అయ్యేదే ఉంది, మళ్ళీ తెల్లగా తయారుచేయడానికి తండ్రికి రావాల్సి ఉంటుంది. తండ్రి అంటారు, నేను కల్పము యొక్క సంగమయుగములో వస్తాను, అంతేకానీ ప్రతి యుగములోనూ కాదు. కూర్మావతారము, మత్స్యావతారము, పరశురామ అవతారము... ఇవన్నీ భగవంతుని అవతారాలు అంటూ చూపిస్తారు. మరి రాయి-రప్పలలో భగవంతుడు ఎలా ఉండగలరు. మనుష్యులు ఎంత అవివేకులుగా అయిపోయారు. తండ్రి వచ్చి ఎంత వివేకవంతులుగా తయారుచేసారు. పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడు, పవిత్రతా సాగరుడు అని మహిమ కూడా చేయాలి. శ్రీకృష్ణునికి ఈ మహిమ ఉండదు. శ్రీకృష్ణుని భక్తులు శ్రీకృష్ణుడు సర్వవ్యాపి అని అనేస్తారు. ఎంతగా అతుక్కుపోతారు. దాని నుండి బయటకు తీసి తండ్రి పరిచయాన్ని ఇలా ఇస్తారు. ఆత్మలందరూ పరస్పరం సోదరులు, అందరూ తండ్రి కాలేరు, మరి అలాంటప్పుడు ఎవరిని స్మృతి చేయడం జరుగుతుంది? గాడ్ ఫాదర్ ను పిల్లలు తలచుకుంటారు. అర్థం చేయించేవారు కూడా అనంతమైన బుద్ధి కలవారై ఉండాలి. పిల్లల బుద్ధి హద్దులో చిక్కుకుపోయి ఉంటుంది. ఒకే స్థానములో కూర్చుండిపోతారు. వ్యాపారస్థులు ఎవరైతే ఉంటారో, వారు పెద్ద-పెద్ద బ్రాంచులు తెరుస్తారు. ఎంతగా సెంటర్లు తెరుస్తారో అంతగా ఆ మేనేజరు మంచివారు. అయితే ఆ తర్వాత సెంటరుపై కూడా ఆధారపడి ఉంటుంది. ఇది అవినాశీ జ్ఞాన రత్నాల దుకాణము. ఇది ఎవరిది? జ్ఞానసాగరునిది. పాయింట్లు అయితే ఎన్నో ఉన్నాయి, వాటిని ధారణ చేసి అర్థం చేయించాలి. సభలో అందరూ చూడగలిగేలా చిత్రాలు ఉండాలి. గడియారము చిత్రము (సృష్టిచక్రము చిత్రము) చాలా బాగుంది. ఈ చక్రాన్ని తెలుసుకోవడం ద్వారా చక్రవర్తులుగా అవుతారు. స్వదర్శన చక్రధారులుగా అవ్వాలి. గడియారంపై అర్థం చేయించడం చాలా సహజము. ఎంతమంది పాత పిల్లలు యోగ్యులుగానే అవ్వరు. తమను తాము అన్నీ తెలిసినవారిగా భావించి కూర్చుంటారు, ఊరికే సంతోషపడిపోతూ ఉంటారు. సేవ చేయకపోతే వీరు దాత అని ఎవరు భావిస్తారు. దానము కూడా బంగారు నాణాలను చేయాలా లేక పైసలనా? ఈ చిత్రాలు అంధుల ముందు అద్దం వంటివి. అద్దంలో తమ ముఖాన్ని చూసుకుంటారు. ఇంతకుముందు కోతి ముఖంలా ఉండేది, ఇప్పుడు మందిరంలోని ముఖంలా తయారవుతుంది. మందిరములో ఉండేందుకు యోగ్యులుగా అయ్యే పురుషార్థం చేయాలి. ఇది పతిత ప్రపంచము, అది పావన ప్రపంచము, దానిని శివబాబా స్థాపన చేస్తున్నారు. ఎవరైతే శ్రీమతముపై నడవరో వారి బుద్ధిలో ఎప్పుడూ ధారణ జరుగదు. తండ్రి అంటారు, ప్రతిరోజు మీకు గుహ్యమైన విషయాలను తెలియజేస్తున్నాను కావున తప్పకుండా జ్ఞానం వృద్ధి చెందుతూ ఉంటుంది.

కొందరు ప్రశ్న అడుగుతారు - 8 తరాలు ఏ విధంగా కొనసాగుతాయి, ఈ లెక్కలో ఇన్ని తరాలు ఉండాలి కదా? తండ్రి అంటారు, మీరు ఈ విషయాలలో ఎందుకు చిక్కుకుంటారు? మొదట తండ్రిని మరియు వారి వారసత్వాన్ని అయితే స్మృతి చేయండి. అక్కడి ఆచార-వ్యవహారాలు ఏవి ఉంటే అవే కొనసాగుతాయి. పిల్లలు ఏ విధంగా జన్మించవలసి ఉంటే ఆ విధంగా జన్మిస్తారు. మీరు ఎందుకు ఈ విషయాలలోకి వెళ్తారు? వికారాల మాటలను మీ నోటి పైకి ఎందుకు తీసుకువస్తారు? ఈ చిత్రాలను ఎవరికైనా కానుకగా ఇవ్వడం చాలా మంచిది. ఇది ఈశ్వరీయ కానుక. ఇటువంటి ఈశ్వరీయ కానుకను ఎవరైనా ఎందుకు తీసుకోరు? క్రిస్టియన్లు ఇంకెవరి సాహిత్యాన్నీ తీసుకోరు, వారికి తమ ధర్మము యొక్క నషా ఉంటుంది. తండ్రి అంటారు, దేవతా ధర్మం అన్నింటికన్నా ఉన్నతమైనది. మాకు ఈ క్రిస్టియన్ల నుండి ఎంతో ధనము లభిస్తుంది అని వారు భావిస్తారు. కానీ ఇవి జ్ఞానము యొక్క విషయాలు. ఎవరైతే జ్ఞానాన్ని తీసుకుంటారో, వారే తండ్రి నుండి వారసత్వాన్ని పొందుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. విశ్వానికి యజమానులుగా తయారుచేసే మాత-పితలపై హృదయపూర్వకముగా బలిహారమవ్వాలి. వారి

శ్రీమతముపై బాగా నడుస్తూ శ్రేష్ఠముగా అవ్వాలి.

2. తమ హృదయాన్ని సదా సత్యంగా ఉంచుకోవాలి. అహంకారములోకి రాకూడదు. బంగారు నాణాలను దానం చేయాలి. జ్ఞాన దానము చేయడంలో మహారథులుగా అవ్వాలి. 8 గంటలు ఈశ్వరీయ సేవను తప్పకుండా చేయాలి.

వరదానము:- సర్వ ప్రాప్తుల అనుభూతి ద్వారా మాయకు వీడ్కోలు ఇచ్చి అభినందనలను పొందే భాగ్యశాలీ అత్మా భవ

ఎవరి సహచరుడైతే సర్వశక్తివంతుడైన తండ్రినో, వారికి సదా సర్వ ప్రాప్తులు ఉంటాయి. వారి ముందుకు ఎప్పుడూ ఏ రకమైన మాయా రాలేదు. ఎవరైతే ప్రాప్తుల అనుభూతిలో ఉంటూ మాయకు వీడ్కోలు ఇస్తారో, వారికి బాప్ దాదా ద్వారా ప్రతి అడుగులో అభినందనలు లభిస్తాయి. కనుక సదా ఇదే స్మృతిలో ఉండండి - స్వయంగా భగవంతుడు ఆత్మలైన మాకు అభినందనలను ఇస్తున్నారు - ఆలోచించను కూడా ఆలోచించనిదానిని పొందారు, తండ్రిని పొంది అన్నింటినీ పొందారు, అటువంటి భాగ్యశాలీ ఆత్మలు మీరు.

స్లోగన్:- స్వచింతన మరియు ప్రభు చింతన చేసినట్లయితే వ్యర్థ చింతన స్వతహాగానే సమాప్తమైపోతుంది.